## నూతన గనులను సాధించుకోవాలి

**కోలిండియా, సింగరేణిపై కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి**



హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): వచ్చే రోజుల్లో ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించే విషయంలో ప్రభుత్వరంగ బొగ్గు సంస్థలు డిమాండ్‌కు తగినట్టుగా నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసేలా సమాయత్తం కావాలని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బొగ్గు సంస్థల మనుగడకు కొత్త గనులను పెంచుకోవడం అత్యంత అవసరమని, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ద్వారా వినియోగదారులకు బొగ్గు అందుబాటులోకి తీసుకురావచ్చని, తద్వారా విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి ప్రజలకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమీక్ష సమావేశానికి కోలిండియా, సింగరేణి ఉన్నతాధికారులు హాజరయ్యారు. సింగరేణి సీఎండీ ఎన్ బలరాం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి సమీక్షలో పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కంపెనీ ప్రగతి, భవిష్యత్తు ప్రణాళికలు తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గింపు, నాణ్యత, సరఫరా తదితర అంశాల్లో ఎదురవుతున్న సవాళ్లు, వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి పలు సూచనలు చేశారు. కార్మికుల జీతాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి ఖర్చు గణనీయంగా తగ్గించాలని సూచించారు. ఇందుకోసం కార్మిక సంఘాల సహకారాన్ని తీసుకోవాలని, పని సంస్కృతిని మెరుగుపరచాలని కోరారు.


### రహస్య పత్రాలను లీక్‌చేస్తే కఠిన చర్యలు

సింగరేణి సంస్థకు సంబంధించిన రహస్య సమాచారాన్ని బయటకు లీక్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంస్థ డైరెక్టర్ (పీపీ అండ్ పర్సనల్) హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఒక సర్క్యులర్ జారీచేశారు. కంపెనీ రహస్య పత్రాలు తమకు ఇవ్వాల్సిందిగా కొందరు వ్యక్తులు ఉద్యోగులను, అధికారులను బెదిరిస్తున్నట్టు, ఒత్తిడికి గురిచేస్తున్నట్టు తెలుస్తున్నదని, అలాంటి వ్యక్తులు ఏ స్థాయిలో ఉన్నా లెక్క చేయాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు.

# బ్యాంకింగ్ మోసాలు 36 వేల కోట్లు

## 2024-25లో తగ్గిన ఫ్రాడ్.. నష్టాలు మూడింతలు

### రిజర్వుబ్యాంక్ వార్షిక నివేదికలో వెల్లడి



ముంబై, మే 29: బ్యాంకింగ్‌లో మోసాలను నియంత్రించడానికి రిజర్వు బ్యాంక్ చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. రుణ ఖాతాలు, డిజిటల్ చెల్లింపులకు సంబంధించి సంఖ్య పరంగా తగ్గినప్పటికి విలువ పరంగా చూస్తే మాత్రం మూడింతలు పెరిగాయి. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రిజర్వు బ్యాంక్ విడుదల చేసిన తన వార్షిక నివేదికలో ఈ విషయాన్ని స్పష్టంచేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.36,014 కోట్ల విలువైన మోసాలు జరిగాయని తెలిపింది. అంతక్రితం ఏడాది రూ.12,230 కోట్ల మోసాలు జరిగాయి. సంఖ్యపరంగా చూస్తే మాత్రం 2023-24లో 36,060 మోసాలు జరగగా, ఆ తర్వాతి ఏడాదికిగాను 23,953కి తగ్గాయి. ప్రధానంగా 122 కేసులకు సంబంధించి సుప్రీంకోర్టు గడిచిన ఆర్థిక సంవత్సరంలో వర్గీకరించడం వల్లనే విలువ భారీగా పెరిగిందని తెలిపింది. బ్యాంకింగ్ మోసాల్లో డిజిటల్ పేమెంట్లు, కార్డు, ఇంటర్నెట్ ద్వారా జరిగే మోసాలు అధికంగా ఉన్నాయని పేర్కొంది. మొత్తం మోసాల్లో 60 శాతం మోసాలు ప్రైవేట్ రంగ బ్యాంకుల్లోనే జరిగాయని తెలిపింది. మొత్తం విలువల్లో వీటి వాటా 71 శాతంగా ఉన్నది. కార్డు/ఇంటర్నెట్ ద్వారా జరిగే మోసాలు అధికంగా 13,516గా నమోదయ్యాయి. మొత్తం 23,956 మోసాల్లో వీటి వాటా 56.5 శాతంగా ఉన్నది. లక్ష రూపాయల కంటే అధికంగా నమోదైన మోసాల గురించి ఆర్బీఐ వివరించింది.

### 25% పెరిగిన కరెన్సీ ప్రింటింగ్ ఖర్చులు

కరెన్సీ ప్రింటింగ్ కోసం పెట్టే రిజర్వు బ్యాంక్ గరిష్ఠ స్థాయిలో ఖర్చు చేస్తున్నది. గతేడాదికిగాను కరెన్సీల ప్రింటింగ్ కోసం రూ.6,372.8 కోట్ల నిధులను ఖర్చు చేసింది. అంతక్రితం ఏడాది ఖర్చు చేసిన రూ.5,101.4 కోట్లతో పోలిస్తే 25 శాతం పెరిగినట్టు తన వార్షిక నివేదికలో వెల్లడించింది. నోట్లు సంఖ్య ఆరు శాతం అధికం కాగా, విలువ పరంగా చూస్తే 5.6 శాతం పెరిగాయి. కరెన్సీ ప్రింటింగ్‌లో రూ.500 నోట్ 86 శాతం వాటా కలిగివున్నది. క్రితం ఏడాదితో పోలిస్తే స్వల్పంగా తగ్గింది. అలాగే రూ.10 డినామినేషన్ బ్యాంక్ నోట్ వాటా 16.4 శాతంగా ఉన్నది. మొత్తం బ్యాంక్ నోట్ల సర్క్యులేషన్‌లో రూ.10, రూ.20, రూ.50 మొత్తంగా 31.7 శాతం వాటా కలిగివున్నది. రెండేండ్ల క్రితం రద్దు చేసిన రూ.2 వేల నోట్లలో ఇప్పటి వరకు 98.2 శాతం నోట్లు బ్యాంకుల వద్ద జమ అయ్యాయి. ప్రస్తుతం మార్కెట్లో రూ.2, 5, 10, 20, 50, 100, 200, 500 నోట్లు చలామణిలో ఉన్నాయి.

### బ్యాలెన్స్ షీట్ పెరుగుదల

రిజర్వు బ్యాంక్ బ్యాలెన్స్ షీట్ ఏడాది ప్రాతిపదికన 8.20 శాతం ఎగబాకి రూ.76.25 లక్షల కోట్లకు చేరుకున్నది. నగదు నిల్వలు అత్యధికంగా ఉండటంతో గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను సెంట్రల్ బ్యాంక్..కేంద్ర ప్రభుత్వానికి రూ.2.69 లక్షల



కోట్ల డివిడెండ్ చెల్లింపులు జరిపింది. పసిడి ఆస్తులు 52.09 శాతం అధికమవగా, దేశీయ పెట్టుబడులు 14.32 శాతం, విదేశీ ఇన్వెస్ట్‌మెంట్లు 1.70 శాతం అధికమయ్యాయి.

### పసిడి నిల్వలు హైజంప్

రిజర్వు బ్యాంక్ వద్ద ఉన్న పసిడి నిల్వలు రికార్డు స్థాయిలో దూసుకుపోయాయి. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను సెంట్రల్ బ్యాంక్ విడుదల చేసిన వార్షిక నివేదికలో పసిడి విలువ ఏడాది ప్రాతిపదికన 57.12 శాతం ఎగబాకి రూ.4,31,624.8 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. అదనంగా 54.13 మెట్రిక్ టన్నుల బంగారాన్ని కొనుగోలు చేయడంతోపాటు ధరలు రికార్డు స్థాయికి చేరుకోవడం వల్లనే విలువ పెరిగిందని వెల్లడించింది. మార్చి 31, 2024 నాటికి గోల్డ్ రిజర్వులు రూ.2,74,714.27 కోట్లుగా ఉన్నది.


**ఆర్బీఐ నివేదికలో కీలక అంశాలు..**

- ముక్కలు చేసిన నోట్లతో కణ బోర్డులను తయారు చేస్తున్నారు.
- డిజిటల్ కరెన్సీ లావాదేవీలు రూ.1,016 కోట్లుగా నమోదయ్యాయి. క్రితం ఏడాది రూ.234 కోట్లుగా ఉన్నాయి.
- ప్రస్తుతం రిజర్వుబ్యాంక్ వద్ద 879.58 మెట్రిక్ టన్నుల విలువైన గోల్డ్ రిజర్వులు ఉన్నాయి. అంతక్రితం ఏడాది 822.10 మెట్రిక్ టన్నులు ఉన్నాయి.
- 311.38 మెట్రిక్ టన్నుల విలువైన పసిడి ఆస్తులు కలిగివుండగా, మిగతా 568.20 మెట్రిక్ టన్నుల విలువైన పసిడి బ్యాంకింగ్ డిపార్ట్‌మెంట్ల వద్ద ఉన్నది.
- గడిచిన ఆర్థిక సంవత్సరంలో అదనంగా 54.13 మెట్రిక్ టన్నుల విలువైన పసిడిని కొనుగోలు చేసింది.

## చివరి అరగంటలో కొనుగోళ్లు

### 320 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై, మే 29: స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాల విధింపుపై అక్కడి కోర్టు అభ్యంతరాలు వ్యక్తంచేయడంతో అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు భారీగా పుంజుకున్నాయి. ఇదే క్రమంలో దేశీయ సూచీలు కూడా లాభాల్లో ముగిశాయి. ఉదయం నుంచి తీవ్ర ఊగిసలాటల మధ్య కొనసాగిన సూచీలు చివరి అరగంటలో మదుపరులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో భారీగా లాభపడ్డాయి. ఒక దశలో 500 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 320.70 పాయింట్లు అందుకొని 81,633.02 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 81.15 పాయింట్లు అందుకొని 24,833.60 వద్ద స్థిరపడింది. ప్రస్తుత నెలకుగాను డెరివేటివ్ కాంట్రాక్ట్ గడువు ముగియడంతో మదుపరులు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఫలితంగా మెటల్, రియల్టీ, ఫార్మా, ఐటీ రంగ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్ మాజీ సీఈవో సుమంత్‌పై మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిషేధం విధించడంతో ఈ బ్యాంక్ షేరు భారీగా లాభపడింది. ఇంట్రాడేలో 3 శాతానికి పైగా లాభపడిన బ్యాంక్ షేరు చివరకు 2.41 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, ఎటర్నల్, టాటా స్టీల్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్‌లు కూడా లాభాల్లో ముగిశాయి. కానీ, బజాజ్ ఫైనాన్స్, ఐటీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్, ఏషియన్ పెయింట్స్ మాత్రం నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే రియల్టీ 1.21 శాతం అధికమవగా, మెటల్, ఐటీ, సర్వీసెస్, టెక్నాలజీ, కమోడిటీస్ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించగా..ఎఫ్ఎంసీజీ రంగ షేరు నష్టపోయింది.



## అమర రాజా రూ.5.20 డివిడెండ్


హైదరాబాద్, మే 29: అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను రూ.2,974 కోట్ల ఆదాయంపై రూ.224 కోట్ల పన్నులు చెల్లించకముందు నికర లాభాన్ని గడించింది. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.12,405 కోట్ల ఆదాయంపై రూ.1,299 కోట్ల లాభాన్ని నమోదు చేసుకున్నది. దీంతోపాటు ప్రతిషేరుకు రూ.5.20 డివిడెండ్‌ను ప్రతిపాదించింది.

## పోకర్ణ లాభం మూడింతలు

హైదరాబాద్, మే 29: గ్రానైట్ తయారీ సంస్థ పోకర్ణ అంచనాలకుమించి రాణించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను సంస్థ రూ.రూ.58.90 కోట్ల నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది నమోదైన లాభంతో పోలిస్తే మూడు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. అలాగే ఆదా యం ఏడాది ప్రాతిదదిన 62.50 శాతం ఎగబాకి రూ.262.68 కోట్లుగా నమోదైంది. 2024-25కిగాను రూ.930.10 కోట్ల ఆదాయంపై రూ. 187.54 కోట్ల లాభాన్ని ఆర్జించింది.

# పసిడి కొనుగోళ్లకు ధరల షాక్

**2025-26లో 10 శాతం వరకు తగ్గనున్న డిమాండ్: ఇక్రా నివేదికలో వెల్లడి**



ముంబై, మే 29: రికార్డు స్థాయిలో దూసుకుపోయిన ధరల కారణంగా బంగారు ఆభరణాల వినిమయంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆభరణాల వినిమయం 9 శాతం నుంచి 10 శాతం వరకు తగ్గే అవకాశాలున్నాయని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో బంగారం ధరలు 33 శాతం పెరగడం ఇందుకు కారణమని తెలిపింది. 2024-25లో కడ్డీల వినిమయం 17 శాతం, నాణేలు 25 శాతం చొప్పున పెరిగాయని పేర్కొంది. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో వీటి ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్లాయని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, గ్రూపు హెడ్ జితిన్ మక్కర్ తెలిపారు. ఈ ఏడాది కడ్డీలు, నాణేల డిమాండ్ 10 శాతం మించే అవకాశాలు లేదని ఆయన స్పష్టంచేశారు. రిటైల్ విస్తరణ, అసంఘటిత విభాగం అధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్నదంటున్న ఆయన.. పెరుగుతున్న ధరల కారణంగా వినియోగం తగ్గుతున్నప్పటికీ, పండుగ సీజన్‌లో డిమాండ్ తగ్గే అవకాశాలు లేవని స్పష్టంచేశారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో బంగారు ఆభరణాల వినిమయం విలువలో గణనీయమైన 28 శాతం పెరుగుదల కనిపించింది. ఈ ఏడాది కూడా ఇదే తరహా పెరుగుదల ఉంటుందని పేర్కొంది.

### ధరలు పెరిగే అవకాశాలు తక్కువే..

ప్రస్తుతం కొనసాగుతున్న బంగారం ధరలు ఈ ఏడాది ఇదే స్థాయిలో కొనసాగే అవకాశాలున్నాయని ఇక్రా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అంతర్జాతీయంగా ఏదైనా అనిశ్చిత పరిస్థితులు నెలకొంటే తప్ప ధరల్లో పెద్దగా మార్పులు ఉండవని తెలిపింది.

### రూ.500 తగ్గిన తులం ధర

గత కొన్ని రోజులుగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడంతో దేశీయ రాజధాని న్యూఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర రూ.500 దిగొచ్చింది. దీంతో పదిగ్రాముల విలువ రూ.99 వేల దిగువకు రూ.98,500కి పడిపోయింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర అంతే స్థాయిలో తగ్గి రూ.98 వేలుగా నమోదైంది. కానీ, వెండి ధరలు యథాతథంగా ఉన్నాయి. కిలో వెండి రూ.1,00,000గా ఉన్నది.



ధర రూ.88,942

## నయా జుపిటర్

న్యూఢిల్లీ, మే 29: ప్రముఖ వాహన సంస్థ టీవీఎస్ మోటర్ కంపెనీ..దేశీయ మార్కెట్లోకి అప్‌గ్రేడెడ్ చేసిన నయా స్కూటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. జూపిటర్ 125 డ్యూయల్ టోన్ స్మార్ట్‌కనెక్ట్‌ని పరిచయం చేసింది. ఈ స్కూటర్ ధర రూ.88, 942గా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి.

### జావా యెజ్డీ షోరూం

జావా యెజ్డీ.. తాజాగా హైదరాబాద్‌లో మరో షోరూంను తెరిచింది. కంపెనీకి చెందిన వాహనాలకు డిమాండ్ అధికంగా ఉండటం వల్లనే మరో షోరూంను ప్రారంభించినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

## గోవుల అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలి

**నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల**

సోన్, మే 29: గోవుల అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలని నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. గురువారం నిర్మల్, సోన్ మండలంలోని కొండాపూర్, గంజాల్ టోల్‌ప్లాజా వద్ద గల చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో గోవుల అక్రమ రవాణాను అరికట్టడానికి జిల్లా, సరిహద్దులో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. నిరంతరం పర్యవేక్షణలో ఉండే విధంగా ప్రత్యేక చెక్‌పోస్టుల్లో పోలీసు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది షిఫ్టుల వారీగా సమన్వయంతో విధులు నిర్వహిస్తారని తెలిపారు. జంతువుల అక్రమ రవాణా, గోవధ విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రధానంగా బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల రవాణా విషయంలో అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, చట్ట విరుద్ధంగా ఆవులు, దూడలను రవాణా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గోవులను రవాణా చేసే ప్రతి వాహనానికి తగు నిర్ధారిత ప్రామాణిక పత్రాలు ఉండాలని స్పష్టం చేశారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి రవాణా అయ్యే గోవుల విషయంలో నియమ, నిబంధనలు క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఎవరైనా అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే వారి వాహనాలు జప్తు చేస్తామని తెలిపారు.

## జాగ్రత్తలు తీసుకోవాలి



అధికారులతో మాట్లాడుతున్న నిర్మల్ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్

లక్ష్మణచాంద, మే 29: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇక్కట్లు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ నిర్వాహకులకు సూచించారు. గురువారం నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని లక్ష్మణచాంద, తిర్‌పెల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. అకాల వర్షాలతో ధాన్యం తడిచిపోవడంతో ఇక్కట్లు ఏర్పడుతున్నాయన్నారు. తడిచిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామన్నారు. రైతులు అందోళన చెందకుండా ప్రభుత్వానికి సహకరించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సరిత, ఆర్ఐ నరేందర్ రెడ్డి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.

## చైల్డ్ పోర్న్ వీడియోలు చూసినా, అప్‌లోడ్ చేసినా కఠిన చర్యలు

ఇచ్చోడ, మే 29 : చైల్డ్ పోర్న్ వీడియోలు చూసినా, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసినా కఠిన చర్యలు తప్పవని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల కాలంలో కొందరు వ్యక్తులు చైల్డ్‌పోర్న్ వీడియోలు చూడడం, వాటిని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం, వివిధ సోషల్ మీడియా ఖాతాల్లో షేర్ చేయడం, ఫార్వర్డ్ చేయడం వంటి చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇటువంటి చర్యలు చట్టరీత్యా నేరమని, వీటిని సహించేది లేదని స్పష్టం చేశారు. సిరికొండ పోలీస్ స్టేషన్‌లో పెందూ ఆత్మకర్‌ను అరెస్టు చేశారు. అతను పిల్లలపై జరిగే అత్యాచార వీడియోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన కారణంగా హైదరాబాద్ చైల్డ్ టిప్ లైన్ వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఎవరైనా ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడినట్లు గుర్తిస్తే, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# విస్తృత ఏర్పాట్లు చేపట్టాలి

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**



మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, హాజరైన అధికారులు

ఎదులాపురం, మే 29 : జూన్ 2వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో వేడుకలను ప్రతి విభాగం సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. సాయంత్రం 4 గంటలకు కల్చరల్ ప్రోగ్రాం నిర్వహించనుండగా, రాజీవ్ యువ వికాసం పథకం కింద ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే అన్ని జంక్షన్లు, కలెక్టరేట్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ దీపాలతో అలంకరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిర్మల్ అర్బన్, మే 29: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.వేడుకలకు ప్రజాప్రతినిధులు, ప్రముఖులను ఆహ్వానించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి పాల్గొన్నారు.

## రహదారి పనులు వెంటనే ప్రారంభించాలి



పెండ్‌పల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యురాలు పడకంటి రమాదేవి

భైంసాటౌన్, మే 29 : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని వానల్‌పాడ్-పెండ్‌పల్లి రహదారి నిర్మాణానికి తొమ్మిది నెలల క్రితమే నిధులు మంజూరైనా పనులు ప్రారంభించకపోవడంతో గుంతల రోడ్డుతో గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యురాలు పడకంటి రమాదేవి కార్యకర్తలతో గురువారం గ్రామాన్ని సందర్శించి రోడ్డును పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెతో వారు పడుతున్న బాధలు చెప్పారు. గర్భిణులు గుంతల దారితో సకాలంలో దవాఖానకు తీసుకెళ్లలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు గుంతలను గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. రమాదేవి మాట్లాడుతూ వెంటనే పనులు ప్రారంభించకపోతే గ్రామస్తులతో కలిసి వానల్‌పాడ్ వద్ద జాతీయ రహదారిపై నిరసన చేపడుతామని హెచ్చరించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎన్నికల్లో గెలిచాక నియోజకవర్గ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. నిధులు మంజూరైన పనులు చేయించలేని అసమర్థ పాలన కొనసాగుతోందని ఎద్దేవా చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో వర్షాలకు తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించారు. కేంద్రాలు ప్రారంభించి నెల రోజులైనా సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు అట్టోలి రాజు, గంగయ్య, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

## బడిబాట ప్రచార జాత ప్రారంభం

ఎదులాపురం, మే 29 : ప్రభుత్వ పాఠశాలల్లో రోజురోజు తగ్గుతున్న ప్రవేశాలను దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయ సంఘం టీఎస్‌యూటీఎఫ్ బాధ్యతగా ప్రచారజాత నిర్వహించడం అభినందనీయమని డీఈవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మూడు రోజుల పాటు ఆదిలాబాద్ జిల్లా తాంసి, భీంపూర్ మండలాల్లో నిర్వహించే బడిబాట ప్రచార జాతను గురువారం ఆర్‌అండ్‌బీ నుంచి జెండా ఊపి డీఈవో ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించే వసతులు వివరిస్తామని టీఎస్ యూటీఎఫ్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఈ జాతలో గ్రామాల్లోని మహిళ సమాఖ్యలను భాగస్వామ్యం చేస్తే ఫలితాలు మంచిగా వస్తాయని సూచించారు. ప్రభుత్వం పాఠశాలల్లో అందించే వసతులు, సౌకర్యాలు, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనంపై క్షేత్రస్థాయిలో ప్రచారం కల్పించాలని కోరారు.

## విత్తనాల దుకాణాల్లో తనిఖీలు

భైంసా, మే, 29 : వానకాలం సీజన్ నేపథ్యంలో పోలీసు, వ్యవసాయ శాఖ సంయుక్తంగా గురువారం నిర్మల్ జిల్లా భైంసాలోని పలు విత్తనాల దుకాణాల్లో తనిఖీ చేశారు. విత్తనాలు, స్టాకు రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ గోపీనాథ్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయిస్తే సహించేది లేదని, వ్యవసాయ శాఖ ఆదేశాలు దుకాణదారులు పాటించాలని అన్నారు. విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఇక్కడ ఏడీఏ వీణ ఉన్నారు.



విత్తన దుకాణాల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

## రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి



రికార్డు పరిశీలిస్తున్న ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్

ఇంద్రవెల్లి, మే 29: వానకాలం సీజన్‌లో విత్తనాలు విక్రయిస్తున్న మండల వ్యాపారస్తులు విత్తనాల కొనుగోలులో మొదటి ప్రాధాన్యత మండల రైతులకు ఇవ్వాలని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లితో పాటు ధనోరా(బీ), ముత్నూర్ గ్రామాల్లోని విత్తనాలు, ఎరువులు, మందులు విక్రయించే దుకాణాలు ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ తనిఖీ చేశారు. నిల్వ చేసిన విత్తనాల ప్యాకెట్లతో పాటు ఎరువులు, మందులు పరిశీలించారు. వివరాల నమోదు అన్ని రకాల రికార్డులు పరిశీలించారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి రాథోడ్ గణేశ్, ఆర్ఐ మెస్రం లక్ష్మణ్ ఉన్నారు.

### నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు

తాంసి, మే 29 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని తహసీల్దార్ లక్ష్మి అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని పొన్నారి గ్రామంలో విత్తనాల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. విత్తన ప్యాకెట్లను, స్టాక్ రికార్డులు పరిశీలించారు. విత్తన దుకాణాదారులు రైతుకు విత్తనాలు విక్రయించినప్పుడు తప్పకుండా లార్డ్ నంబర్‌తో కూడిన బిల్లు అందజేయాలని సూచించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి ఉన్నారు.

### అంధ విద్యార్థికి ఆర్థిక సాయం

ఇంద్రవెల్లి, మే 29 : ముత్నూర్ గ్రామానికి చెందిన మస్కే నితేశ్ అనే అంధ విద్యార్థి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుకుంటున్నాడు. ఆ విద్యార్థి కుంటుంబంతో పాటు ఆయన ఆర్థిక పరిస్థితులు బాగులేకపోవడంతో కళాశాలతో పాటు కళాశాల హాస్టల్ ఫీజు కట్టడానికి డబ్బులు లేకపోవడంతో ఫీజు కట్టలేదు. ఈ విషయం తెలుసుకున్న ముత్నూర్ గ్రామస్తులు దుర్వా సంతోష్, జైస్వాల్ మనోజ్‌తో పాటు పలువురు కలిసి రూ.6వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రంగుల రాజు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

### రసాయన ఎరువులు తక్కువ మోతాదులో వాడాలి

బజార్‌హత్నూర్, మే 29 : రైతులు పంటలకు రసాయన ఎరువులు తక్కువ మోతాదులో వాడి ఖర్చులను తగ్గించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్రవేత్త డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం బజార్‌హత్నూర్ మండలం ధరంపూరి గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రాజశేఖర్, శివచరణ్ మాట్లాడుతూ విత్తనాలను 60 నుంచి 70 మిల్లి మీటర్ల వర్షాపాతం కురిసిన తర్వాత విత్తుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మహ్మద్ సౌద్, ఏఈవోలు పాల్గొన్నారు.